సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ǀ 17 ǀ డిసెంబర్ ǀ 2024



ఎన్నాళ్లీ పరీక్ష..?

జీఆర్‌ఏయూలో పరీక్షల నిర్వహణ వ్యవస్థ గాడిన పడడం లేదు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



ఉద్దానంలో అలజడి

ఉద్దానంలో మరోసారి అలజడి రేగింది. గుర్తు తెలియని జంతువు తిరిగింది.

- 8లో

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ, అఫిలియేషన్ కళాశాలల పీజీ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతున్నాయి. 410 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

విలువ ఆధారిత ఉత్పత్తులతో రాబడి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో సోమవారం చేపలు, రొయ్యలు పెట్టుబడి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మత్స్య పరిశ్రమ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపలతో అనేక రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు చేయడం ద్వారా నాణ్యమైన చేప ఉత్పత్తులు వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు. విశాఖపట్టణంకు చెందిన మత్స్య శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు, బి.కోటేశ్వరరావు వివిధ రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థికి నివాళి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన సివిల్ ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థి రమావత్ ప్రవీణ్ నాయక్‌కు సోమవారం సాయంత్రం సంతాప సభ నిర్వహించారు. సభలో డైరెక్టర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ మాట్లాడుతూ విద్యార్థి మృతి మానసికంగా ఎంతో ఆందోళన కలిగించిందని అన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం దురదృష్టకరమని చెప్పారు. కుటుంబానికి సానుభూతి తెలియ జేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, విలువైన జీవితం గుర్తించి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరాలని అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన



సోలార్ పరికరాల వినియోగంపై ఆరా తీస్తున్న ఈఈ యోగేశ్వరరావు తదితరులు

అరసవల్లి: విద్యుత్ వినియోగం అధికమవుతున్న తరుణంలో గృహ, గృహేతర వినియోగదారులంతా సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టిపెట్టి అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి సూచనల మేరకు స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సోలార్ పరికరాల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల వినియోగంతో విద్యుత్ చాలావరకు ఆదా అవుతుందని, అలాగే అతి తక్కువ ఖర్చులతో సోలార్ ద్వారా విద్యుత్‌ను వినియోగించుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ పేరుతో సబ్సిడీ ద్వారా సోలార్ రూఫ్ ఏర్పాటు చేస్తున్నాయని, వినియోగదారులు విద్యుత్ శాఖకు ఈ మేరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ పరికరాల వినియోగం, ధరలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ శ్రీనివాస్, ఈఈలు సురేష్‌కుమార్, బయ్యన్నాయుడు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, జేఏఓలు ఆర్.శ్రీనివాస్, సనపల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 10 రోజులుగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నా కనీసం కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకపోవడం దారుణమని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద 10వ రోజు నిరసన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు పెంచాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ పనులను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ జగన్నాథరావు, ఎం.శ్రీను, ఎం. చంద్రశేఖర్, ఎస్.ఢిల్లీ, రాజు, ఎల్. చంద్రశేఖర్, సత్తిబాబు, అక్కలనాయుడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏదీ శాంతి ఎక్కడ భద్రత


వణికిన సిక్కోలు

CRIME SPOT LIGHT

ప్రశాంత సిక్కోలుపై నెత్తుటి మరకలు పడుతున్నాయి. ఏ కల్మషం ఎరుగని మన పల్లెల్లో నేరాలు పెరుగుతున్నాయి. పేదవాడి స్వర్గంగా కీర్తినందుకున్న జిల్లా ఇప్పుడు హత్యలు, దొంగతనాలు, దాడుల వార్తలతో బెంబేలెత్తిపోతోంది. ఓ వైపు గొలుసు దొంగతనాలు భయపెడుతుంటే... మరో వైపు హత్యల్లాంటి భయంకర నేరాలు వణికించేస్తున్నాయి. ఇంకోవైపు దొంగతనాల నెపంతో జరుగుతున్న దాడులు సామాన్యుల భద్రతను ప్రశ్నిస్తున్నాయి. సోమవారం ఒక్కరోజే జిల్లాలో రెండు హత్యలు, ఒక దోపిడీ, ఒక చోరీ ఘటనతో పాటు దోపిడీ యత్నం కూడా నమోదైంది.

- శ్రీకాకుళం క్రైమ్/ఆమదాలవలస/కవిటి / సారవకోట/ఇచ్ఛాపురం /ఇచ్ఛాపురం రూరల్

- అటు హత్యలు ఇటు దోపిడీలు
- సోమవారం ఒక్కరోజే 5 ఘటనలు





మహిళ హత్య CR No. 353/24

ఆదివారం అర్ధరాత్రి తరువాత

ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస నిర్వాసిత కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ మహిళను దారుణంగా హతమార్చారు. భర్తను కోల్పోయి కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించుకుంటున్న దామోదర పద్మ అనే మహిళను కత్తితో ఛాతీలో పొడిచి చంపేశారు. అర్ధరాత్రి తల్లిని రక్తపు మడుగులో చూసి పిల్లలు నిర్ఘాంతపోయారు. నిందితుడు పరారైపోయాడు.

దొంగతనతం CR No. 200/24

సోమవారం ఉదయం 10.40

సారవకోటలోని గ్రామీణ వికాస బ్యాంకు ఆవరణలో.. సోమవారం గ్రామీణ బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్న తంగుడు సురేష్ అనే వ్యక్తి వద్ద రూ.1.40 లక్షలు కొట్టేశారు. డబ్బు పెట్టిన బ్యాగ్‌ను చూడమని ఇద్దరికి చెప్పి.. తాను మెడికల్‌స్టోర్‌కు వెళ్లి వచ్చేలోపే ఆ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిపోయారు. బ్యాంకు పోలీస్‌స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలోనే ఉండడం విశేషం.





సోమవారం ఉదయం 10.20

చైన్ స్నాచింగ్ CR No. 233/24

ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో నీలవేణి అనే మహిళ మెడలో మూడు తులాల బంగారు గొలుసును తెంపుకుని వెళ్లిపోయారు. బెల్లుపడ గ్రామానికి చెందిన ఈమె ఎమ్మెల్యేను కలవడానికి వెళ్తుండగా స్కై డ్రాప్ కూడలి దాటిన తర్వాత ఓ వ్యక్తి వచ్చి చిరునామా అడిగే నెపంతో మెడలో ఉన్న గొలుసును తెంపుకుని వెళ్లిపోయాడు.



ఆదివారం అర్ధరాత్రి తరువాత

వ్యక్తి హత్య CR No. 172/24

ఇచ్ఛాపురం మండలంలోని లొద్దపుట్టి-జరడా జంక్షన్ వద్ద ఓ యాచకుడిని చంపేశారు. ఆదివారం రాత్రి అతని తలపై బండరాయితో మోది చంపేస్తే సోమవారం ఉదయం విషయం వెలుగుచూసింది. ఎవరు చంపారో తెలియరాలేదు. గంజాయి, మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.


సోమవారం ఉదయం 8.25

టీచర్‌పై స్నాచర్ దాడి CR No. 99/24

కవిటి మండలంలోని వింధ్యగిరి సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఓ టీచర్‌పై చైన్ స్నాచర్ దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలో బంగారాన్ని కాజేసేందుకు ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించారు. దీంతో ఆమె తలపై రాయితో దాడి చేశాడు. అంతలో అటుగా జనం రావడంతో పరారైపోయాడు. ఆమెకు తలపై ఐదు చోట్ల గాయాలయ్యాయి. ఈమె బొర్రపుట్టుగలోని ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నారు.



ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణ



కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును అనుసరించి షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సోమవారం జిల్లాలో పర్యటించింది. ముందుగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు సంబంధించిన అంశంపై ఆయా షెడ్యూలు కులాలు, ఆ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా మెమొరాండం స్వీకరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఆయా సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించారు. దాదాపు 59 షెడ్యూల్డ్ ఉప కులాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. విజ్ఞప్తులు ఇక్కడ చెప్పలేకపోతే విజయవాడలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ వారి కార్యాలయంలో మెమొరాండం అందజేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పంజాబ్, తమిళనాడులో ఎస్సీ వర్గీకరణ అమలుతో పాటు హరియానా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వ మోహన్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ సహా పలువురు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే షెడ్యూల్ ఉపకులాల వర్గీకరణపై అధికారులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ కులాల వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘ నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను సత్కరించారు. ముందుగా జిల్లా విస్తీర్ణం, జనాభా, కులాల వారిగా ఉన్న జనాభా గణాంకాలు, జిల్లాలో ఉన్న కులాల వారీగా గణాంకాలు వివరించారు.

- షెడ్యూల్ కులాల ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో జోనల్ వ్యవస్థలపై జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు వినతులు అందించారు.
- ఎస్సీ కులాల్లో అందరికీ నాణ్యమైన విద్య అందించాలని షెడ్యూలు కులాల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అశాస్త్రీయమని అన్నారు.
- ఎస్సీ ఆది ఆంధ్ర కులాన్ని 'డి'గా గతం మాదిరిగానే కొనసాగించాలని ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఆదిఆంధ్రులు కోరుతూ చలో కలెక్టరేట్ నిర్వహించారు.
- వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ/ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు కమిషన్ వద్ద స్పష్టం చేశారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గాయత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎచ్చెర్లకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గాయత్రి మరోసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ జిల్లా కామోతి నగరం వేదికగా ఈనెల 25 నుంచి 29 వరకు ఆలిండియా సీనియర్ నేషనల్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు జిల్లాలోని ఎచ్చెర్ల మండలంలోని ఎచ్చెర్ల గ్రామానికి చెందిన ముంత గాయత్రి ప్రాతినిధ్యం వహించనుంది. నగరంలోని చైతన్య కోపరేటివ్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ఈ విద్యార్థిని ఇప్పటికే అనేక రాష్ట్ర,జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. నేషనల్ మీట్‌కు ముందు నంద్యాలలో ఈనెల 17 నుంచి జరగనున్న శిక్షణ శిబిరానికి సోమవారం ఇక్కడ నుంచి పయనమైంది.



జిల్లా కార్యదర్శి కృష్ణంరాజుతో ముంత గాయత్రి

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథాలయంలో సోమవారం ఉదయం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌కు విశేష అభిషేకాల్లో భాగంగా పంచామృతాభిషేకాలు ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గోదాదేవి, చక్రనారాయణ స్వామి మూర్తులను తిరుప్పావై సేవా కాలం, బేడా మంటపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య తిరువీధి జరిపారు. తీర్థగోష్టి అనంతరం నెలగంట కార్యక్రమంలో గంటకు పూల మాలను అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం బేడా మంటపంలో శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు తిరుప్పావై ప్రవచనములు ప్రారంభమయ్యాయి.

- గార

మీకోసంలో 49 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీకోసంలో అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 49 అర్జీలు వచ్చాయి.




వృద్ధుని గోడు వింటున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

62 వినతులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (మీకోసం) ఫిర్యాదు చేసిన అర్జీదారుల సమస్యలను నాణ్యతా ప్రమాణాలతో విచారణ జరపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం 62 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ అనంతరం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి దిశానిర్దేశం చేశారు.

● రూ.6వేల ఖర్చుతో.. 192 ఏళ్ల క్రితం




జిల్లా కేంద్రంలోని చిన్నబజారు రోడ్డులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చి జిల్లాలోనే మొదటిదని చెబుతుంటారు. దీన్ని 1832లో ఈస్టిండియా కంపెనీకి చెందిన మిస్టర్ బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిరంగా ఏర్పాటు చేశారు. 1846 సెప్టెంబరు 12న తెలుగు బాప్టిస్టు చర్చిని ప్రారంభించారు. అప్పట్లో రూ.6వేలు వ్యయంతో దీన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయి.

- శ్రీకాకుళం కల్చరల్

క్రిస్మస్ స్పెషల్

తెలుగు బాప్టిస్టు చర్చి

ఒకే ప్రశ్నపత్రంతో..



- నేటి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో పరీక్షల నిర్వహణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మంగళవారం నుంచి అర్ధసంవత్సర పరీక్షలు జరగనున్నాయి. గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విధంగా ఇంటర్మీడియెట్ విద్య త్రైమాసిక, అర్ధ సంవత్సర పరీక్షల్లో సరికొత్త రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్ష రాసే విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పరీక్షకు ముందు ప్రశ్న పత్రం కాలేజీల లాగిన్ ద్వారా ప్రిన్సిపాల్‌కు చేరుతుంది. ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా క్వశ్చన్‌పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటౌట్స్ తీసి, కళాశాలల్లో నిర్దిష్టమైన సమయానికి విద్యార్థులకు అందజేసి పరీక్షలను రాయించనున్నారు. పరీక్షల నిర్వహణపై డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ప్రిన్సిపాళ్లతో పలుమార్లు ఏర్పాట్లపై సమీక్షించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫస్టియర్‌కు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకెండియర్ విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలను నిర్వహిస్తున్నారు. పరీక్షల ముగిసిన వెంటనే జవాబుపత్రాల దిద్దుబాటును పూర్తిచేసి ఆన్‌లైన్‌లో మార్కులు అప్‌లోడ్ చేయాలి. పరీక్షల ఫలితాలపై జిల్లా అధికారులు, ఇంటర్‌బోర్డు అధికారులు సమీక్షించనున్నారు.

క్లుప్తంగా

బిచ్చగాడి హత్య..!



ఘటనా స్థలంలో బిచ్చగాడి మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: పాన్‌షాపు ఆవరణలో బిచ్చగాడి హత్య కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లొద్దపుట్టి–జరడా జంక్షన్ వద్ద ఉన్న పాన్ షాపు ఆవరణలో నిద్రిస్తున్న బిచ్చగాడి(సాధూ)(60)ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బండరాయిలతో మోది హత్య చేసినట్లు పాన్‌షాపు యజమాని గుర్తించి సోమవారం ఉదయం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులను విచారించారు. బలమైన బండరాళ్లతో తలపై మోది హత్య చేసినట్లు గుర్తించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో రెండు బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. ఊరు, పేరు తెలియని మృతుడు గత మూడేళ్ల నుంచి స్థానిక ధనరాజులమ్మ ఆలయం వద్ద బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, అతని పూర్తి పేరు తెలియకపోయినా అక్కడ ఉన్నవారంతా 'సాధూ'గా పిలుస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గంజాయి, మద్యం మత్తులో ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేయగా, సీఐ ఎం.చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాతపట్నం: మండలంలో సీది కూడలి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద హిరమండలం మండలం ధనుపురం గ్రామానికి చెందిన మడపటి కృష్ణారావు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణారావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధనుపురం గ్రామానికి చెందిన మడపటి కృష్ణారావు సోమవారం సాయంత్రం కొరసవాడ నుంచి ధనుపురానికి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో పెద్దసీది కూడలి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో కృష్ణారావు తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆటోలో పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం గ్రామానికి చెందిన బోర ఈశ్వరరావు (49) సమీప తోటల్లో మృతి చెంది కనిపించాడు. కుమారుడు రామిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం సాయంత్రం కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. అయితే మృతుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. ఇతర కారణాలు ఉన్నాయా అనే దానిపై పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బ్యాంకు ఆవరణలో దొంగతనం

- రూ.1.4 లక్షలు దోచుకెళ్లిన దుండగుడు
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు



బ్యాంకులో సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్



డబ్బులు పోగొట్టుకున్న సురేష్

సారవకోట: మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు ఆవరణలో సోమవారం ఉదయం రూ.1.40 లక్షలను గుర్తు తెలియని వ్యక్తి దోచుకెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామీణ బ్యాంకు కస్టర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్న బొంతు గ్రామానికి చెందిన తంగుడు సురేష్, తాను గ్రామాల్లో బ్యాంకు లావాదేవీల ద్వారా సేకరించిన సొమ్మును సోమవారం బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వచ్చి బ్యాంకు ఆవరణలో కూర్చున్నాడు. ఆయనతో పాటు కుమ్మరిగుంట, మహాశింగి కస్టమర్ సర్వీస్ పాయింట్లు నిర్వహిస్తున్న వారు సైతం ఉన్నారు. బ్యాంకు ఆవరణలో సురేష్ ఒక పాలిథిన్ కవర్‌లో రూ.1.40 లక్షలు పెట్టి, దానిని బ్యాగ్‌లో భద్రపరిచాడు. అనంతరం బ్యాగును అక్కడ ఉంచి తనతో ఉన్న ఇద్దరు కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకులైన ఆదినారాయణ, చలపతిరావులకు చూడమని చెప్పి సమీపంలో ఉన్న మెడికల్ స్టోర్‌కి వెళ్లాడు. ఇలోగా గుర్తు తెలియని వ్యక్తి దానిని గమనించి బ్యాగ్‌లో ఉన్న పాలిథిన్ కవర్‌లోని సొమ్ముతో ఉడాయించాడు. మెడికల్ స్టోర్ నుంచి వచ్చిన సురేష్ బ్యాగ్ చూసినప్పటికీ డబ్బులు లేకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. స్థానిక ఎస్‌ఐ అనిల్‌కుమార్ తన సిబ్బందితో బ్యాంకులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించినా ఫలితం లేకపోవడంతో, సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాల, రైస్ మిల్లులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలతో పాటు అర్లి టోల్‌గేట్, బొంతులలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఎన్నాళ్లీ పరీక్ష..!



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం

- బీఆర్‌ఏయూలో గాడినపడని పరీక్షల నిర్వహణ వ్యవస్థ
- సమస్యల నిలయంగా మారిన వర్సిటీ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ పరీక్షల నిర్వహణ ఇంకా గాడిన పడడం లేదు. ఈ వర్సిటీ 2008లో ఏర్పడగా, 2010లో జిల్లాలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలల పాలన స్థానిక విశ్వవిద్యాలయానికి అప్పగించారు. అయినా ఇప్పటికీ విద్యార్థులకు అత్యంత కీలకమైన పరీక్షలు నిర్వహణ, ఫలితాలు ఇవ్వడం, మార్కులు జాబితాలు అందజేయడం, రీ వాల్యూయేషన్ దరఖాస్తుల సమస్య పరిష్కరించడం వంటివి షెడ్యూల్ మేరకు సక్రమంగా జరగడం లేదు. దీంతో విద్యార్థులు పరీక్షల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

ప్రతిఏటా 40 వేల మందికి పరీక్షలు

బీఆర్‌ఏయూలో ఉమ్మడి జిల్లాలోని 83 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 14 బీఎడ్, ఏడు పీజీ, ఒక న్యాయ కళాశాల, ఒక ఎంబీఏ కళాశాల, నాలుగు బీపీఈడీ, డీపీఈడీ కళాశాలలు ఉన్నాయి. వర్సిటీ క్యాంపస్‌లో 19 పీజీ కోర్సులు, ఇంజినీరింగ్ ఐదు కోర్సులు నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా మొత్తం 40 వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇంత కీలకమైన పరీక్షల నిర్వహణ కార్యాలయంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వంటి పోస్టులు లేవు. బయో టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్‌గా, అర్గానిక్ కెమిస్ట్రీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.పద్మారావు ఇన్‌చార్జి అండర్ గ్రాడ్యుయేషన్స్ ఎగ్జామినేషన్స్ డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పరీక్షల నిర్వహణ కీలక బాధ్యతలను ఇటీవల ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగి సమ్రాజ్య లక్ష్మికి ప్రత్యేక అధికారిగా నియమించి అప్పగించారు.

ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యం

వర్సిటీ పరీక్షల నిర్వహణ, సకాలంలో ఫలితాలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రధానంగా డిగ్రీ చివరి సెమిస్టర్, పీజీ చివరి సెమిస్టర్‌లో ఎక్కువగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే రీవాల్యూయేషన్ ఫలితాలు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే వాటిని మర్చిపోవాల్సిందే అన్న విమర్శలు ఉన్నాయి. చాలాసార్లు రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల కాకుండానే, సంప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తే ఈ పరీక్షలు సైతం విద్యార్థులు రాయాల్సిన దుస్థితి ఉంది. మరోవైపు ఒరిజనల్ డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు కోసం అనేక సార్లు విద్యార్థులు విశ్వవిద్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డిజీలాకర్ సిస్టం అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వర్సిటీ ఏర్పడ్డాక ఇప్పటివరకు రెండుసార్లు(2017, 2022లో) మాత్రమే స్నాతకోత్సవాలు జరిగాయి.

ఇబ్బందులు లేకుండా చర్యలు

> విద్యార్థులకు ఇబ్బంది లేకుండా షెడ్యూల్ మేరకు పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, ధ్రువీకకణ పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎగ్జామినేషన్ కేంద్రంలో కొంతవరకు సిబ్బంది కొరత ఉన్నా, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. యూజీసీ నిబంధనలు మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నాం.
>
> – డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, పీజీ ఎగ్జామినేషన్స్ డీన్

ఉలిక్కిపడ్డ గాజులకొల్లివలస

- మహిళ దారుణ హత్య
- పరారీలో నిందితుడు



పద్మ (ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని గాజుల కొల్లివలస నిర్వాసిత కాలనీలో ఆదివారం అర్ధరాత్రి మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. నిర్వాసిత కాలనీకి చెందిన దామోదర పద్మ(35) తన ఇద్దరి కుమార్తెలతో నివాసముంటోంది. తన భర్త దామోధర కృష్ణ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తను కూలి పనులు చేస్తూ, అలాగే కిరాణా దుకాణం నడిపించుకుంటూ తన కుమార్తెలను చదివిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తన పక్కింట్లో ఉండే నిందితుడు సొండి సురేష్ అనే వ్యక్తితో సాన్నిహిత్యంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఈ హత్యకు గల ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు ఇటీవల మాల వేసుకున్నాడని, మృతురాలు పద్మపై అనుమానం పెంచుకొని అర్ధరాత్రి సమయంలో ఆమె ఇంటికి వచ్చి తలుపులు కొట్టగా, ఆమె తలుపులు తీసిన తర్వాత వారిద్దరిమధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అనంతరం నిందితుడు తనతో తీసుకెళ్లిన కత్తితో ఆమె చాతిపై పొడిచినట్లు పోలీసులు తెలిపారు. ఆమె రక్తపు మడుగులో ఉంటూ కేకలు వేయగా నిద్రలో ఉన్న తన కుమార్తెలు లేచి తన తల్లి పరిస్థితి చూసి హడలిపోయారు. వెంటనే ఇరుగుపొరుగు వారు మృతురాలి ఇంటివద్దకు చేరుకొని ఉలిక్కిపడ్డారు. హత్య చేసిన నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శంకర్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని లెప్రసీ కాలనీలో సోమవారం ఉదయం జరిగిన యువకుడి ఆత్మహత్య కలకలం రేపింది. ఒకటో పట్టణ ఎస్‌ఐ–2 బి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. లెప్రసీ కాలనీ రామ మందిరం వీధిలో నివసిస్తున్న పట్నాన శంకర్ (23) కొంతకాలంగా ఓ వివాహితతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆమె గిన్నెలు తోముతున్న సమయంలో శంకర్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఆమె పనులు ముగించి వెళ్లి చూసేసరికి శంకర్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో చుట్టుపక్కల వాళ్లని కేకలు వేసి పిలవడంతో అంతా కలిసి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. స్థానికులు ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఉద్దానంలో అలజడి

- మరోసారి గుర్తు తెలియని జంతువు సంచారం
- ఆవు దూడను చంపేసి, రెండోసారి తినడానికి వచ్చిన వైనం



గుర్తు తెలియని జంతువు పాదముద్ర



దూడను పరిశీలిస్తున్న వైద్యులు, ఫారెస్టు అధికారులు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో గుర్తు తెలియని జంతువు అలజడి సృష్టించిన ఘటనలు మరువకముందే మరోసారి ఉద్దాన ప్రాంతాన్ని ఉలికిపడేలా చేసింది. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని జంతువు ఆవుల మందపై దాడి చేసింది. ఈ దాడిలో ఆవుదూడ మాంసాన్ని ఆరగించి అక్కడి నుంచి పలాయించింది. గుర్తు తెలియని జంతువును గుర్తించడానికి ఆవు దూడను ఆదే ప్రాంతంలో కాపరులు విడిచిపెట్టడంతో సోమవారం సైతం రెండోసారి ఘటనా స్థలానికి వచ్చి ఆవుదూడను మరోసారి ఆరగించింది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు, మందలు కాసే కాపరులు తీవ్రమైన భయాందోళనకు గురవుతున్నారు. మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య, నాయకులు కుత్తుం సురేష్, రేవతీపతిలు పరిసర ప్రాంత పరిస్థితి కాశీబుగ్గ ఫారెస్టు అధికారి మురళీకృష్ణంనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన ఫారెస్టు అధికారులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. పలాస పశువైద్యులు డాక్టర్ మధు, రెవెన్యూ ఉద్యోగులు, ఫారెస్టు అధికారుల సమక్షంలో ఆవుదూడకు పోస్టుమార్టం చేపట్టారు. మూగజీవాలపై దాడులు చేస్తున్న గుర్తు తెలియని జంతువును పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



రమేష్‌కుమార్ మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్లే డౌన్‌లైన్ ఊసవానిపేట గేటు సమీపంలో సోమవారం సాయంత్రం పలాస నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న డీఎంయూ పాసింజర్ కిందపడి యువకుడు మృతి చెందాడు. శ్రీకాకుళం రోడ్ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మన్యం జిల్లా పాలకొండ మండలం వెలగవాడ గ్రామానికి చెందిన సీమల రమేష్‌కుమార్(19) ట్రాకువద్ద తిరుగుతూ రైలు బండి వచ్చిన సమయంలో ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్‌కార్డు వివరాలతో తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తలించారు.

దారికాచి.. దోచుకొని

- రాజపురం – భైరిపురం రోడ్డులో ఉపాధ్యాయినిపై చైన్‌స్నాచర్ మెరుపుదాడి
- ప్రతిఘటించి గాయాలతో బయటపడిన బాధితురాలు
- మరో మహిళ మెడలో 3 తులాలు చోరీ
- ఉద్దానంలో కలకలం రేపుతున్న వరుస దొంగతనాలు



కవిటి: గాయపడిన టీచర్ భారతికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది



కవిటి: మెరుగైన చికిత్స కోసం భారతిని పలాస తరలించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని ఆర్.భైరిపురం నుంచి రాజపురం వెళ్లే మార్గంలో వింధ్యగిరి సమీపంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం ఉదయం చైన్ స్నాచర్ ప్రభుత్వ ఉపాధ్యాయిని బల్లెడ భారతిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఉద్దానం ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 8.00 గంటలకు ఎప్పటిలానే ఆర్.భైరిపురంలో తన ఇంటి నుంచి సమీపంలోని బొర్రపుట్టుగలో తాను పనిచేస్తున్న ఎంపీ పాఠశాలకు ఉపాధ్యాయిని బల్లెడ భారతి బయల్దేరింది. ప్రతీరోజూ ఇదే మార్గంలో వెళ్లే ఆమెను బాగా పరిశీలించిన అగంతకుడు సరిగ్గా వింధ్యగిరి సమీపంలోని మలుపు నాలుగురోడ్ల కూడలి వద్ద మాటువేసిన 8.25 గంటల సమయంలో హఠాత్తుగా దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలోని బంగారాన్ని కాజేసే ప్రయత్నంలో వారిమధ్య తీవ్రంగా పెనుగులాట జరిగింది. ఈ ప్రయత్నంలో ఉపాధ్యాయిని భారతి ధైర్యంగా ఎదిరించింది. దీంతో దుండగుడు అక్కడే ఉన్న రాయిని తీసుకుని ఆమె తలపై కిరాతకంగా బాదాడు. దీంతో ఆమెకు ఐదుచోట్ల తీవ్ర రక్తస్రావంతో కూడిన గాయాలయ్యాయి. ఇంతలో అదేమార్గంలో ద్విచక్రవాహనం వస్తున్న శబ్దాన్ని గుర్తించిన నిందితుడు పరారయ్యాడు.

రైతు సాయంతో పాఠశాలకు

అనంతరం ఆ మార్గంలో వస్తున్న ఓ రైతును బాధితురాలు సాయం కోరింది. దీంతో ఆమెను ఆ రైతు బొర్రపుట్టుగ పాఠశాలలో అప్పగించారు. అక్కడికి చేరుకున్న గ్రామస్తులు హుటాహుటిన తీవ్రంగా గాయపడిన ఆమెను కవిటి సీహెచ్‌సీకి 9 గంటల ప్రాంతంలో ఆటోలో తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ డా.బి.అశోక్ ఆస్పత్రికి చేరుకుని ఆమెకు ధైర్యం చెప్పారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం పలాస పంపించారు. అక్కడ స్కానింగ్ చేసి పరిశీలించిన వైద్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్

ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలో మహిళ మెడలోని 3 తులాల బంగారు గొలుసుని దుండగుడు తెంపుకొని వెళ్లినట్లు పట్టణ ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం ఉదయం బెల్లుపడ గ్రామానికి చెందిన లండ నీలవేణి తన కుమార్తెతో కలిసి తన స్కూటీపై, కవిటి మండలం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే ఆశోక్‌ను కలిసేందుకు వెళ్తోంది. ఈ సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, స్కైలాబ్ కూడలి దాటిన తర్వాత ఇటుకల బట్టీ సమీపంలో ఈదుపురానికి ఎలా వెళ్లాలని అడిగాడు. ఇంతలో ఆ మహిళ ఇటువైపుగా వెళ్లాలని చెబుతుండగానే మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడుని తెంపుకొని ఈదుపురం వైపు వెళ్లిపోయాడు. ఈ ఘటనలో మహిళ, తన కుమార్తె స్కూటీ పైనుంచి కింద పడిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలు.. బెదిరింపులు.. అకృత్యాలు..

అడిగితే దాడులు

- ఆర్మీ కాలింగ్ రమణ ఆగడాలపై ఎస్పీకి ఫిర్యాదుల వెల్లువ
- 'మీ కోసం'లో గోడు వెళ్లబోసుకున్న బాధితులు



ఎస్పీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాధిత విద్యార్థులు



మాజీ ఆర్మీ సంక్షేమ సంఘంతో కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన బాధితులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో ఆర్మీ కాలింగ్ రమణ ఆకృత్యాలపై మరోసారి బాధితులు కదం తొక్కారు. సుమారు 30 మందికిపైగా పాత, కొత్త విద్యార్థులు జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం వచ్చి మీ కోసంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమకు జాబులు ఇప్పిస్తానని నమ్మబలికి బసవ వెంకటరమణ మాయమాటలతో నమ్మించాడన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము ఇంట్లో తల్లిదండ్రులను ఒప్పించి, బంగారాలు తనఖా పెట్టించి, వడ్డీలకు తీసుకొని రూ.లక్షల్లో తీసుకొచ్చి ఇచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను యూనిట్లుగా విభజించి ఒక్కో యూనిట్‌లో 25 నుంచి 30 మంది ఉండేలా కేటాయించారన్నారు. యూనిట్‌లో ఏ ఒక్కరు తప్పు చేసినా లాఠీలు, డేటా కేబుల్ వైర్లతో విచక్షణారహితంగా కొట్టేవాడని వాపోయారు. అమ్మాయిల వసతి గృహంలో సీసీ కెమెరాలు పెట్టించి, వీడియోలు చిత్రీకరించి, బ్లాక్ మెయిలింగ్‌తో చిత్రహింసలకు గురిచేసేవాడని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధిక సంఖ్యలో ఆర్మీ కాలింగ్ బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి రావడంతో వారికి సంఘీభావంగా జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం నుంచి జేఏసీ గౌరవాధ్యక్షుడు నంబళ్ల గోవిందరాజు, ప్రెసిడెంట్ ఎస్.రామారావు, జనరల్ సెక్రటరీ సీహెచ్ అమ్మాజీ, అడ్వైజర్ ఎస్‌పీ రావు, పొలిట్‌బ్యూరో పార్లమెంటరీ ఎం.శంకర్‌నారాయణ, ఎగ్జిక్యూటివ్ సువ్వారి నీలాచలంలు వచ్చారు.

జూనియర్‌తో అసభ్యంగా ప్రవర్తించాడు

> నేను గతేడాది ఆగస్టు 28న జాబ్ కోర్సులో జాయిన్ అయ్యాను. అక్కడికి కొద్ది రోజుల్లోనే మొబైల్‌లో తన మీద అభిప్రాయం తెలపాలంటూ చెత్తగా మెసేజ్‌లు పంపాడు. అంతేకాకుండా ఒక జూనియర్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో అడిగినందుకు కక్షకట్టాడు. స్నేహితులతో కలిసి తల్లిదండ్రుల అనుమతితో బీచ్‌కు వెళ్లినందుకు ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో, వేరే భవనంలోని పైఅంతస్తులో మూడురోజుల పాటు డేటా కేబుల్ వైర్‌తో చితకబాదాడు. మా అనుమతి లేకుండా వసతి గృహం వాష్ రూమ్, పరుపు మంచాలున్న గదిలో సీసీ కెమెరాలు పెట్టాడు.
>
> – ఒక విద్యార్థిని, పరవాడ, విశాఖపట్నం జిల్లా


రూ.3.50 లక్షలు తీసుకున్నాడు

> మా ఇంట్లో సమస్యలున్నాయని తెలిసినా ఇంటికొచ్చి తానొక ఆర్మీ ఉద్యోగినని, పెద్దవాళ్లతో పరిచయాలున్నాయని మా తల్లిదండ్రులను నమ్మించి, ఒప్పించి జాయిన్ చేయించాడు. ట్రైనర్ సమక్షంలో రూ.3.50 లక్షలు తీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత జాబ్ రాలేదని అడిగితే మీ గదిలో సీసీ కెమెరా ఉందని, మీరు చేసేవన్నీ అందులో ఉన్నాయని చెప్పి కొన్ని అసభ్యకర ఫొటోలు చూపించడంతో బెదిరిపోయాం. అప్పటికే నాకు పెళ్లి ఫిక్సయ్యిందని చెప్పి ప్రాధేయపడినా లాఠీ తీసుకుని కాళ్లమీద, వీపుమీద, చేతులతో చెంపమీద కొట్టి నిర్దాక్షిణ్యంగా చిత్రహింసలకు గురిచేశాడు. ఇలా మరో పదిమంది అమ్మాయిలను మానసికంగా, శారీరకంగా హింసించడం కళ్లారా చూశాను.
>
> – ఒక విద్యార్థిని, రాజాం, విజయనగరం జిల్లా

మూడో కంటికి తెలియకుండా

> 2023 ఆగస్టులో చేరిన మా అబ్బాయికి జాబ్ వస్తుందని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడు. డబ్బులిచ్చేటప్పుడు తన క్యాబిన్‌లోకి మా ఫోన్లు తీసుకురావొద్దని చెప్పేవాడు. లోపలున్న సీసీ కెమెరాలు ఆపేసేవాడు. మూడో కంటికి తెలియకుండా డబ్బులు తీసుకున్న రమణ, చివరిసారిగా రూ.1.50 లక్షలు ఇచ్చేముందు నన్ను ఫోన్‌లో తీవ్ర దుర్భాషలాడాడు. నా కొడుకుతో చేయరాని పనులు చేయించాడు. మా అన్న కొడుకు కూడా రూ.5.50 లక్షలు కట్టాడు. అంతా జాబ్ వస్తుందనే భరించాం. ఇప్పుడు మోసాలు తెలిసి రక్తం మరిగిపోతోంది. జైలు నుంచి వచ్చినా విడిచేది లేదు.
>
> – ఒక విద్యార్థి తండ్రి, సింగుపురం, శ్రీకాకుళం

అప్పుడే కట్టడి చేయాల్సింది



> 2018–19లోనే రమణపై జలుమూరులో 18 మంది విద్యార్థులు రూ.కోట్లలో మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. 2021లో జిల్లా కేంద్రంలోని ఆర్మీ కాలింగ్ అవకతవకలపై, విద్యార్థులపై రమణ ఆకృత్యాలను తెలుసుకుని 600 మంది విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి సంస్థలో చేరకుండా చేశాను. రమణకు సహకరించిన ఆర్మీ ఎన్‌జీవో అనిల్, మరికొందరు రమణ ఆగడాలు చూసి సంస్థ నుంచి అప్పటికే లెఫ్ట్ అయిపోయారు. 80 మందికి పైగా మోసపోయిన స్టూడెంట్స్‌తో ఒకటో పట్టణ పీఎస్‌కు వెళ్తే.. అప్పటి ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లు రమణకే వత్తాసు పలికారు. 'ఆయన డబ్బులిస్తాడు..' మీరు కొంతమందితో వెళ్లండని చెప్పి స్టేషన్‌వద్ద ఉన్న మిగతా బాధిత విద్యార్థులను బెదిరించి పంపేశారు. అక్కడికి వెళ్లాక రమణ కొంతమంది విద్యార్థులతో నాపై దాడి చేయించాడు. దీంతో ఫిర్యాదు ఇవ్వడానికి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లాను. మూడువారాలైనా ఎఫ్‌ఐఆర్, ఛార్జిషీటు వేయకపోవడంతో అప్పటి ఎస్పీకి ఫిర్యాదు చేయగా, అనంతరం ఎస్‌ఐ తప్పుడు ఛార్జిషీటు వేశారు. ఒకరిద్దరు మీడియా వ్యక్తులు, పోలీసుల సహకారం రమణకు ఉంది. ఇప్పటికైనా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి లోకేష్, ఎస్పీలు యాక్షన్ తీసుకోవాలి. లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం. న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు.
>
> – తిరుమలరాజు (రవిరాజు), ఎక్స్ నేవీ ఉద్యోగి